కాంగ్రెస్‌పై కేసీఆర్ కదన భేరి!

మొదటిపేజీ తరువాయి...

దిగజార్చుతున్నారని నిప్పులు చెరుగుతున్నారు. ఇంకా మౌనంగా ఉండిపోతే రాష్ట్రం అధోగతి పాలవుతుందని ఆయన నిశ్చయానికి వచ్చారు. అలవిగాని హామీలతో అరచేతిలో వైకుంఠం చూపించి ప్రజలను వంచించిన కాంగ్రెస్ పార్టీ ప్రజలకు శూన్య హస్తం చూపిస్తూ ఉంటే బాధ్యత కలిగిన ప్రతిపక్షంగా మాత్రమే కాకుండా ఈ రాష్ట్ర ఆవిర్భావానికి, అభివృద్ధికి అంకితమై పనిచేసిన బీఆర్ఎస్ చూస్తూ ఊర్కోరాదని, రాజకీయాలు, కుట్రలు, ప్రచారాలు తప్ప ప్రజలకు కించిత్ మేలు చేయని సర్కారు మీద యుద్ధభేరి మోగించబోతున్నారని ఆయన సన్నిహిత వర్గాలు చెప్తున్నాయి. కేసీఆర్ మౌనంగా ఉన్నారంటే ఆయన మస్తిష్కంలో వెయ్యి యుద్ధాలకు సమానమైన మహోద్యమ పథక రచన జరిగినట్టేనని వారు విశ్లేషిస్తున్నారు.

ఈ నేపథ్యంలో తెలంగాణకు, తెలంగాణ ప్రజలకు కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న మోసంపై బీఆర్ఎస్ త్వరలోనే యుద్ధభేరి మోగించనున్నదా? తెలంగాణ ఉద్యమం తరహాలో పెను కార్యాచరణను తీసుకోనున్నదా? మోసపోయి గోసపడుతున్న తెలంగాణ ప్రజల కోసం వినూత్న పోరాట రూపాలను తీర్చిదిద్ది, కేసీఆర్ స్వయంగా ముందుండి పాల్గొననున్నారా? పార్టీలో ఇప్పుడు ఈ చర్చే జరుగుతున్నది.

ఉద్యమానికి సీనియర్ల ఒత్తిడి...

రేవంత్‌రెడ్డి ప్రభుత్వానికి ఇచ్చిన సమయం ఇక చాలని, ఇంకా చూస్తూ కూర్చుంటే తెలంగాణ కుప్పకూలే ప్రమాదం ముంచుకొస్తున్నదని బీఆర్ఎస్ సీనియర్లు ఇప్పటికే కేసీఆర్ దృష్టికి తీసుకువచ్చారు. 'మీరు తెచ్చిన తెలంగాణ ఆగమై పోకుండా ఉండేందుకు మీరే స్వయంగా రంగంలోకి దిగాల్సిన తరుణం ఆసన్నమైంది. కాంగ్రెస్ మెడలు వంచి హామీలు అమలు చేయించాల్సిన, ప్రజలకు ఊరట కలిగించాల్సిన సమయం వచ్చింది. ఇంకా మనం మౌనం వహించడాన్ని ప్రజలు ఆమోదించడం లేదు' అని సీనియర్లు కేసీఆర్‌కు విన్నవించినట్టు విశ్వసనీయ వర్గాలు తెలిపాయి.

సై అంటున్న మేధావులు..

ఒకప్పుడు కేసీఆర్‌తో కొంత విభేదించిన పలువురు మేధావులు కూడా బహిరంగంగానే, కేసీఆర్ ఉన్నప్పుడే బాగుండె, ఆయన రంగంలోకి దిగితే తప్ప కాంగ్రెస్ సర్కారు కదిలేలా లేదు అని టీవీ ఇంటర్వ్యూల్లో ఓపెన్‌గానే చెప్తున్నారు. ఈ నేపథ్యంలో బీఆర్ఎస్ నేతల వాదనతో కేసీఆర్ కూడా సూత్రప్రాయంగా అంగీకరించినట్టు తెలిసింది. దీంతో వినాయకచవితి తర్వాత రాష్ట్రంలో రాజకీయ ధూమ్‌ధామ్ దద్దరిల్లే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. తొమ్మిది నెలల్లో ఒక్క మంచి పని జరగకపోవడం, హామీల అమలుకు కనీస కార్యాచరణ ప్రారంభం కాకపోవడం, ప్రభుత్వంలోని పెద్దల మధ్య సమన్వయం లేకపోవడం, ప్రజల సమస్యలను పరిష్కరించే ధోరణి కనిపించకపోవడంతో సర్కారుపై ఒత్తిడి తేకపోతే, పరిస్థితి మరింత చేయి దాటిపోయే ప్రమాదం ఉందని బీఆర్ఎస్ సీనియర్లు భావిస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని వర్గాల్లో నెలకొన్న నైరాశ్యం, ఆగమైపోతున్నామనే ఆందోళన, వేచిచూసినా పరిస్థితి మెరుగుపడే ఆశావహ వాతావరణం కనిపించకపోగా మరింత దిగజారుతున్న దృష్ట్యా ఇక రంగంలోకి దిగకతప్పదని బీఆర్ఎస్ సీనియర్లు కేసీఆర్‌కు చెప్పారు. ప్రజలకు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను అమలు చేయించే బృహత్తర బాధ్యతను నెత్తికి ఎత్తుకోక తప్పదని కేసీఆర్‌కు వారు సూచించారు. అనేక వర్గాలు అసంతృప్తిగా ఉన్నాయని, అయితే ఆర్గనైజ్డ్ నాయకత్వం లేని కారణంగా ప్రభుత్వం మీద ఆయా వర్గాలు తగినంత ఒత్తిడి తేలేకపోతున్నాయని కేసీఆర్ దృష్టికి వారు తీసుకొచ్చారు. మోసం చేసిన కాంగ్రెస్‌పై ఒత్తిడి తెచ్చేందుకు బీఆర్ఎస్ వైపు చూస్తున్నారని, వారికి నాయకత్వాన్ని అందించే బాధ్యత తీసుకోవాలని కేసీఆర్‌కు సూచించారు. పార్టీ కీలక నేతలు, వివిధ వర్గాల ప్రముఖుల నుంచి వస్తున్న వినతుల నేపథ్యంలో సెప్టెంబరు 10 నుంచి బీఆర్ఎస్ పోరాట కార్యాచరణకు సన్నాహాలు మొదలుపెట్టనున్నట్టు తెలిసింది. ఇందులో భాగంగా పార్టీ కార్యవర్గాన్ని, ఎంపీలు, ఎమ్మెల్యేలు, మాజీ మంత్రులు, మాజీ ప్రజా ప్రతినిధులతో విస్తృతస్థాయి సమావేశం నిర్వహించనున్నట్టు పార్టీ వర్గాలు వెల్లడించాయి.



ఇంకా వేచిచూస్తే విధ్వంసమే...

రాష్ట్రంలో కాంగ్రెస్ సర్కార్ ఏర్పడి 9 నెలలు పూర్తి కావస్తున్నది. సర్కారు కుదురుకునే దాకా తగినంత సమయం ఇవ్వాలని కేసీఆర్ మొదటి నుంచీ చెప్తూ వస్తున్నారు. అందుకే ఇప్పటిదాకా వేచిచూసే ధోరణిని బీఆర్ఎస్ అవలంబించింది. అయితే ఇక కదనభేరి మోగించకతప్పదని పార్టీ ఒక నిర్ణయానికి వచ్చినట్టు తెలిసింది. బీఆర్ఎస్ పార్టీ రైతు, మహిళా, విద్యార్థి, ఎస్సీ, ఎస్టీ, యువత, మైనారిటీ ఇలా అన్ని విభాగాలు ఎక్కడికక్కడ క్షేత్రంలోకి దిగి 'ఏం చేస్తే ప్రస్తుతం నెలకొన్న పరిస్థితుల నుంచి బయటపడ్తాం' అనే కోణంలో సెప్టెంబరు 10 తర్వాత సమాలోచనలు చేపట్టనున్నది. పార్టీ ప్రజాప్రతినిధులు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, కార్యకర్తలు, జిల్లా అధ్యక్షులు, పార్టీ అనుబంధ విభాగాలు, మండల, గ్రామ.. ఇలా అన్నిస్థాయిల పార్టీ క్యాడర్‌తో సమాలోచనలు జరిపి ఉమ్మడి ఉద్యమ కార్యాచరణను చేపట్టే అవకాశం ఉందని పార్టీ వర్గాలు వివరించాయి. కూల్చుడు తప్ప కట్టుడు తెలియని కాంగ్రెస్ సర్కార్ ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయించేదాకా, చేయకపోతే గద్దె దించేదాకా అవిశ్రాంత ప్రజాపోరుకు గులాబీ శ్రేణులు సిద్ధం అవుతున్న స్పష్టమైన సంకేతాలు కనిపిస్తున్నాయి.

ఆరు గ్యారెంటీలూ అమలు చేయాల్సిందే!

అసెంబ్లీ ఎన్నికలకు ముందు అధికారంలోకి రావటం కోసం రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ, బేషరతుగా, ఎలాంటి ఆంక్షలు లేని అనేక హామీలు ఇచ్చాయి. బీఆర్ఎస్ నుంచి వచ్చిన దానికన్నా, నాలుగు పైసలు ఎక్కువ వస్తాయన్న ఆశతో అదనంగా రెండు శాతం కంటే లోపు ప్రజలు కాంగ్రెస్ వైపు మొగ్గారు. అయితే అధికారంలోకి వచ్చిన తర్వాత కాంగ్రెస్ మొండిచెయ్యి చూపింది. మెల్లమెల్లగా గ్యారెంటీల ప్రస్తావన ఎత్తడమే మానేసింది. దానిస్థానంలో చవకబారు మాటలు, విమర్శలు చేసి ప్రజలతో డైవర్షన్ గేమ్ ప్రారంభించింది. అమలుచేసిన ఒకటి రెండింటికి కూడా పలు ఆంక్షలు, షరతులు, నిబంధనలు విధిస్తూ లబ్ధిదారుల సంఖ్యను కుదిస్తున్నది. మొదలేపెట్టని గ్యారెంటీలను కూడా అన్నీ అమలైపోతున్నయ్ అంటూ మంత్రులు చేస్తున్న ప్రకటనలు, వాటిని అమలు చేసే ఉద్దేశం లేకపోగా దబాయింపులు ఎక్కువయ్యాయి. నిబంధనల సాకుతో హామీలను ఎగబెట్టాలె అన్నదే కాంగ్రెస్ విధానంగా కనిపిస్తున్నది. ఏ రంగాన్ని తీసుకున్నా ఇదే పరిస్థితి. అమలు చేయలేమని తెలిసి కూడా కాంగ్రెస్ ఆరు గ్యారెంటీలు ఇచ్చిందనీ, అందువల్ల వాటిని అమలు చేయించక తప్పదనీ బీఆర్ఎస్ ముఖ్యుల అభిప్రాయపడుతున్నారు. '1956లో ఆంధ్రాతో విలీనానికి ముందు తెలంగాణ హక్కులు కాపాడుతామని కాంగ్రెస్ నేతలు అనేకసార్లు హామీలిచ్చారు. తర్వాత మాట తప్పారు. తెలంగాణ రాష్ట్రం కావాలని తొలి, మలి ఉద్యమాలు జరిగినప్పుడు రాష్ట్రం ఇస్తామని అనేకసార్లు హామీలిచ్చారు. తర్వాత గట్టునపెట్టారు. కానీ ఇప్పుడు అట్లా నడిచే పరిస్థితి ఉండదు. ఇది పాత తెలంగాణ కాదు. తెలంగాణ ప్రజల కోసం కొట్లాడేందుకు బీఆర్ఎస్ పార్టీ ఉన్నది. కాంగ్రెస్‌కు తప్పించుకునే చాన్స్ ఇచ్చే ప్రసక్తే తలెత్తదు' అని పార్టీ ముఖ్యనేత ఒకరు పేర్కొన్నారు.

ధ్వంసమైన వ్యవసాయరంగం

కేసీఆర్ హయాంలో ఉజ్వలంగా వెలిగిన వ్యవసాయ రంగం ఏదో శాపం తలిగినట్టు, 8 నెలల్లోనే కుదేలై కూర్చున్నది. రైతుబంధు ఇవ్వకుండా, రైతు భరోసాను అమలు చేయకుండా కాంగ్రెస్ తమను నిలువునా ముంచిందన్న భావన రైతుల్లో బలంగా నెలకొన్నది. ఎరువులు, విత్తనాల కొరత, కరెంటు ఇబ్బందులు! ఇక అన్ని పంటలకు బోనస్ ఇస్తామన్న కాంగ్రెస్, చివరికి వరికి మాత్రమే అని ముక్కువిరిచి, దాన్లోనూ సన్నాలకు మాత్రమే ఇస్తామని మాట్లాడి, చివరికి నాలుగైదు వెరైటీలకే బోనస్ వర్తింపజేసిన తీరు రైతాంగాన్ని నివ్వెరపరిచింది. యాసంగి కొనుగోళ్లను గమనిస్తే, పండించిన ధాన్యమన్నా కొంటారో లేదో తెల్వని పరిస్థితి. ఇక ప్రభుత్వం చెప్పున్న రుణమాఫీ సగం మంది రైతులకు కూడా వర్తించలేదు. రైతులు ఎక్కడికక్కడ స్వచ్ఛందంగా ఆందోళనకు దిగుతున్నారు. బ్యాంకుల చుట్టూ, ఏఈవోల చుట్టూ తిరుగుతున్నారు. అనేకచోట్ల ఆందోళన చేస్తున్న రైతాంగానికి బీఆర్ఎస్ అండగా నిలిచినా, రైతాంగం అనార్గనైజ్డ్‌గా ఉండటం వల్ల ఎవరికివారే మదనపడుతున్నారు. రుణమాఫీ పరిణామాల నేపథ్యంలో రైతులకు పంట రుణాలు ఇచ్చేందుకు బ్యాంకులు ముందుకు రావడం లేదు. పైపెచ్చు కాంగ్రెస్ సర్కార్ చేసిన రుణమాఫీ పూర్తి కాకపోవడంతో పాత అప్పు కడితేనే కొత్త అప్పు ఇస్తామని తెగేసి చెప్తున్నాయి. ఈ నేపథ్యంలో దిక్కుతోచని స్థితిలో ప్రైవేట్ వడ్డీ వ్యాపారులను రైతులు ఆశ్రయిస్తున్నారు. ఇదే అదనుగా భావించిన వడ్డీ వ్యాపారులు రైతుల అవసరాన్ని ఆసరాగా చేసుకొని వడ్డీరేట్లను ఇబ్బడిముబ్బడిగా పెంచేస్తున్నారు. ఇక ఎరువులు, విత్తనాల కోసం పల్లెల్లో చెప్పులు, సంచులను క్యూలైన్లో పెట్టే దృశ్యాలు, తోపులాటలు, ఎరువుల దుకాణాలు, బ్యాంకుల్లో పోలీసుల పహారా తెలంగాణలో వ్యవసాయ రంగంలో నెలకొన్న దయనీయ పరిస్థితికి అద్దం పడుతున్నాయి. రాజకీయ కక్షతో కాళేశ్వరాన్ని ఎండబెట్టడంతో అనేక జిల్లాల్లో సాగునీటి సంక్షోభం ఏర్పడింది. చివరికి రైతులే కార్లు వేసుకుని, శ్రీరాంసాగర్ వద్దకు వచ్చి నీళ్లు వస్తాయా లేవా అని తెలుసుకోవాల్సిన దుస్థితి. కేసీఆర్ పాలనలో నెలకొన్న పండుగను రేవంత్‌సర్కార్ పడావు పెట్టిందనే ఆందోళన నెలకొన్నది. ఇలా ఎటు చూసినా దిక్కుతోచని స్థితితో రాష్ట్ర రైతాంగం తీవ్ర నిరాశ, నిస్పృహల్లోకి వెళ్లింది. ఇటువంటి విపత్కర పరిస్థితుల్లో రైతుకు భరోసా కల్పించి వారి మానసిక స్థైర్యాన్ని నిలబెట్టడం కేసీఆర్‌కు మినహా మరెవరికీ సాధ్యం కాదని బీఆర్ఎస్ సీనియర్లు అభిప్రాయపడుతున్నారు.

ఆడబిడ్డలకు మోసం

ఎన్నికలకు ముందు తెలంగాణ మహిళాలోకానికి రేవంత్ అరచేతిలో స్వర్గం చూపించారు. అధికారంలోకి వచ్చాక, ఉచిత ప్రయాణం కల్పించామని, దీంతో మహిళాలకు తాము ఇచ్చిన అన్ని హామీలు అమలయ్యాయన్న రీతిలో కాంగ్రెస్ పార్టీ వ్యవహరిస్తున్నది. కల్యాణలక్ష్మి కథ వొడవని ముచ్చటగా మారింది. ఆడబిడ్డ పెండ్లికి తులం బంగారం అని ఇచ్చిన హామీ ఎటుపోయిందో ఎవరికీ తెలియదు. గృహిణులకు నెలనెలా రూ.2,500 ఊసే లేదు. గ్యాస్ సిలిండర్ సబ్సిడీ ఎవరికి అందుతున్నదో తెలియని అయోమయ పరిస్థితి నెలకొన్నది. గృహలక్ష్మి ఎవరిని కరుణిస్తుందో ఎవరికీ అర్థం కావడం లేదు.

సంక్షేమం సదా విస్మరణ

కాంగ్రెస్ సర్కార్ సంక్షేమం సదా విస్మరణగా మారిపోయింది. కేసీఆర్ సర్కార్ ప్రారంభించిన రూ.10 లక్షల దళితబంధును తాము అధికారంలోకి వస్తే రూ.12 లక్షలకు పెంచుతాం అని కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మ్యానిఫెస్టోలో పెట్టింది. ఊరూరా దండోరా వేసింది. ఓట్లు దండుకున్న తెల్లారే దళితబంధుకు రాంరాం చెప్పింది. గిరిజనబంధుకు ఎగనామం పెట్టింది. కొత్తవి ఇవ్వకపోగా పాతపథకాన్ని కూడా అమలు చేయటంలేదు. కేవలం 9 నెలల్లో రేవంత్ సర్కారు ఏకంగా 65 వేల రూ.కోట్ల అప్పు చేసింది. సీఎం రేవంత్‌రెడ్డి ఇప్పుడు ప్రపంచబ్యాంకు అప్పులు తెచ్చే పనిలో పడ్డారు.

నిరుద్యోగులు భగభగ

కాంగ్రెస్ తమను ఆగం చేసింది అని నిరుద్యోగులు తీవ్ర ఆగ్రహంతో ఉన్నారు. తమను ఏదో ఉద్ధరిస్తుందనుకున్న నిరుద్యోగుల భ్రమలు పటాపంచలు కావడానికి ఎక్కువ సమయం పట్టలేదు. కేసీఆర్ హయాంలో జరిగిన ఉద్యోగ ప్రక్రియకు నియామక పత్రాలు చేతిలో పెట్టి తమ ఘనతగా కాంగ్రెస్ ప్రచారం చేసుకున్నప్పుడే నిరుద్యోగుల్లో అనుమానాలు తలెత్తాయి. ఆ తర్వాత జరిగిన అనేక పరిణామాలు ఆ అనుమానాలను నిజం చేశాయి. ఏడాదిలో రెండు లక్షల ఉద్యోగాలు అన్న ఆశలు ఆవిరయ్యాయి. కేసీఆర్ హయాంలో వెనకుండి నడిపించిన మేధావులు తమ పదవులు తాము చూసుకుంటూ ఉంటే మోసపోయిన నిరుద్యోగులు నెత్తిన చేతులు పెట్టుకుంటున్నారు. రెండు లక్షల ఉద్యోగాలు పోయాయి. జాబ్ క్యాలెండర్‌లో తేదీల క్యాలెండర్ మాత్రమే చేతికి వచ్చింది. జాబ్‌లు గాల్లో కలిసిపోయాయి. కనీసం నిరుద్యోగుల చిరు డిమాండ్లు 1:100 వంటి వాటిని కూడా పట్టించుకున్న వాడు లేడు. ఎగే సినోడు అందలం మీద కూర్చున్నాడు. నిరుద్యోగులు రోడ్ల మీద పడ్డారు.

లోకం పోకడ



వానకాలం

	గరిష్ఠం	కనిష్ఠం
ఆదిలాబాద్	36.4°c	22.8°c
మెదక్	36.0°c	21.4°c
రంగారెడ్డి	35.1°c	20.2°c
కరీంనగర్	30.0°c	24.0°c
హైదరాబాద్	29.4°c	22.7°c
నల్లగొండ	29.0°c	23.0°c
నిజామాబాద్	28.3°c	23.5°c
వరంగల్	28.0°c	24.0°c
ఖమ్మం	26.0°c	24.0°c
మహబూబ్‌నగర్	25.1°c	21.3°c

నేడు, రేపు రాష్ట్రంలో భారీ వర్షాలు

హైదరాబాద్, ఆగస్టు 30 (నమస్తే తెలంగాణ): పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో తీవ్ర అల్పపీడనం ఏర్పడింది. శనివారం వాయుగుండంగా మారే అవకాశం ఉంది. దీని ప్రభావంతో తెలుగు రాష్ట్రాలు, దక్షిణ ఒడిశాతో పాటు తెలంగాణలో ఓ మోస్తారు నుంచి భారీ వర్షాలు, ఒకటి రెండు చోట్ల అతి భారీ వర్షాలు పడే అవకాశం ఉంది. శనివారం ఆదిలాబాద్, కుమ్రుం భీం ఆసిఫాబాద్, మంచిర్యాల, జగిత్యాల జిల్లాల్లో అతి భారీ వర్షాలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం స్పష్టంచేసింది. అలాగే నిర్మల్, నిజామాబాద్, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, మహబూబాబాద్, వరంగల్, హనుమకొండ, హైదరాబాద్, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశాలున్నాయని తెలిపింది. లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జీహెచ్ఎంసీ అధికారులు సూచించారు.

అక్టోబర్‌లోనూ వర్షాలు

నైరుతి రుతుపవనాలు సెప్టెంబర్ చివరి వరకూ కొనసాగే అవకాశం ఉండటంతో అక్టోబర్‌లోనూ వర్షాలు కురిసే అవకాశముందని భారత వాతావరణశాఖ అధికారులు చెబుతున్నారు. ఈ సెప్టెంబర్, అక్టోబర్‌లో రుతుపవనాల వర్షపాతం లా నినా వాతావరణ పరిస్థితులకు అనుకూలంగా ఉన్నట్టు ఐఎండీ అధికారులు చెబుతున్నారు. రుతుపవనాల తిరోగమనంలో లా నినా అభివృద్ధి చెందితే.. అది ముగియడానికి చాలా సమయం తీసుకుంటుందని చెబుతున్నారు. సెప్టెంబరు 3-4 వారాల్లో, అక్టోబర్ ప్రారంభంలో భారీ వర్షాలు కురిస్తే, అప్పటికే చేతికొచ్చే పంటలకు, విత్తిన పంటలకు తీవ్ర నష్టం వాటిల్లనుందని ఫిలిప్ క్యాపిటల్ ఇండియాలో కమోడిటీస్ రీసెర్చ్ వైస్ ప్రెసిడెంట్ అశ్విని బన్సోద్ మీడియాకు తెలిపారు. వర్షాలు, వరదలతో ఏర్పడే పంటనష్టం కారణంగా ఆహార ద్రవ్యోల్బణానికి ఆజ్యం పోస్తుందని అంచనా వేస్తున్నారు.

స్థానిక ఎన్నికలపై నేడు అఖిలపక్షం

రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆధ్వర్యంలో నిర్వహణ

హైదరాబాద్, ఆగస్టు 30 (నమస్తే తెలంగాణ) : స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణపై రాష్ట్ర ఎన్నికల కమిషన్ తన కార్యాచరణను ప్రారంభించింది. ఇప్పటికే వార్డుల వారీగా ఓటర్ల జాబితా ప్రక్రియ తుది దశకు చేరింది. ఈ నేపథ్యంలో శనివారం మధ్యాహ్నం 3 గంటలకు వివిధ రాజకీయ పార్టీలతో అఖిలపక్ష సమావేశాన్ని ఏర్పాటుచేయనున్నది. మాసబ్‌ట్యాంక్‌లోని ఎన్నికల కమిషన్ కార్యాలయంలో గుర్తింపు పొందిన పార్టీలకు ఇప్పటికే ఆహ్వానం పంపింది. ఓటర్ల జాబితాపై పార్టీల సలహాలు, సూచనలు, అభ్యంతరాలు, ఫిర్యాదులు స్వీకరించనున్నారు. సెప్టెంబర్ 6న ఓటర్ల ముసాయిదా జాబితా, 21న తుది ఓటర్ల జాబితాను ప్రచురించనున్నారు.

త్వరలో వర్సిటీలకు కొత్త వీసీలు

సెప్టెంబర్‌లో సెర్చ్ కమిటీ సమావేశాలు

హైదరాబాద్, ఆగస్టు 30 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలోని యూనివర్సిటీలకు త్వరలో కొత్త వైస్‌చాన్స్‌లర్లు నియమితులుకానున్నారు. ఈ దిశగా రాష్ట్ర ప్రభుత్వం కసరత్తును తీవ్రతరం చేసింది. సెప్టెంబర్ మొదటి లేదా రెండో వారంలో సెర్చ్ కమిటీ సమావేశాలను నిర్వహించనున్నారు. ఒకే రోజులో సమావేశాలను ముగించి, ఆ తర్వాత గవర్నర్‌కు పంపించనున్నారు. ఆమోదం రాగానే కొత్త వీసీలను నియమిస్తూ ప్రభుత్వ జీవోలను జారీచేసే అవకాశముంది. మొత్తం ప్రక్రియను 15 నుంచి 20 రోజుల్లో ముగించాలని సర్కారు గడువుగా పెట్టుకున్నట్టు అధికారులు తెలిపారు.

పాత పెన్షన్ విధానమే కావాలి: జేఏసీ

హైదరాబాద్, ఆగస్టు 30 (నమస్తే తెలంగాణ): కేంద్ర ప్రభుత్వం సీపీఎస్ స్థానంలో యూపీఎస్ పెన్షన్ విధానాన్ని తీసుకొస్తామని ప్రకటించడాన్ని తెలంగాణ ఉద్యోగుల జేఏసీ చైర్మన్ వీ లచ్చిరెడ్డి తీవ్రంగా వ్యతిరేకించారు. శుక్రవారం జేఏసీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడిన ఆయన సీపీఎస్, యూపీఎస్ రెండు పెన్షన్ విధానాలు వద్దేవద్దన్నారు. పాత పెన్షన్ విధానాన్ని మాత్రమే అమలుచేయాలని డిమాండ్ చేశారు. ఉద్యోగ సంఘాల నాయకులు రాములు, కే రామకృష్ణ, గోపాల్, రమాదేవి, దర్శన్‌గౌడ్, కత్తి జనార్ధన్, ప్రగతికుమార్, ఎస్ రాములు, సంపత్‌కుమార్ స్వామి పాల్గొన్నారు.

ఇదేం సర్కార్.. ఇదేం పాలన!

మొదటిపేజీ తరువాయి...

చూస్తున్నవారు, ప్రభుత్వ పెద్దలతో చెట్టపట్టాలేసుకుని తిరుగుతున్నవారే ఈ మాటలు అంటుండడం చూస్తుంటే రాష్ట్రంలో పాలన ఎలా సాగుతున్నదో అర్థం చేసుకోవచ్చు. ఏ ఇద్దరు కాంగ్రెస్ నేతలను కదిలించినా పాలన పడకేసిందని, ఏ పనీకావడం లేదని చెప్పుకుంటున్నారు. రాష్ట్రంలో పాలన మొత్తం స్తంభించిపోయిందని అన్ని వర్గాలూ అభిప్రాయపడుతున్నాయి. ప్రభుత్వాన్ని చాలా దగ్గరి నుంచి చూస్తున్న నల్లగొండ జిల్లాకు చెందిన కీలక నేత ఒకరు ముఖ్యమంత్రి పని విధానంపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. 'మొదలు ఏదో అనుకున్నం. కానీ మావోడికి తెలుస్త లేదు. ప్రభుత్వానికి ఆదాయం ఎట్ల సమకూర్చాలో తెలియడం లేదు. ఖర్చు ఎలా చేయాలో మాత్రం బాగా తెలుస్తున్నది' అని వ్యాఖ్యానించారు. 'మేమేందో పెద్దగా ఊహించుకున్నం. ఎమ్మెల్యేలే కాదు, అధికారులు కూడా గందరగోళంగానే ఉన్నారు' అని అదే జిల్లాకు చెందిన మరో ప్రజాప్రతినిధి వివరించారు.

పొద్దంత తిప్పుకుంటడు

'పొద్దంతా కార్ల తిప్పుకుంటడు. కానీ, ఎక్కడి పని అక్కడే పెడ్తడు' అని సీఎం వ్యవహారశైలిపై సొంతపార్టీ ఎమ్మెల్యే ఒకరు వ్యాఖ్యానించారు. 'రేపు మనం కలుద్దాం' అని సీఎం చెప్పగానే ఇకనా పని అయిపోయినట్టే అని ఆ ఎమ్మెల్యే భావించారట. చెప్పిన టైంకు వెళ్లి.. తన పని గురించి చెప్పగానే 'పోతూ పోతూ మాట్లాకుందాం పావే' అంటూ కారువైపు దారి చూపి 'కారు ఎక్కగానే ఆ ముచ్చట.. ఈ ముచ్చటా అన్నీ తీస్తాడు. అసలు ముచ్చట తీసేలోపే వేరే ముచ్చట. ఇట్లా సాయంత్రం దాకా దగ్గరే ఉంచుకొని, వెంటతిప్పుకొని 'తప్పకుండా చేద్దాం.. తరువాత చేద్దాం' అని దాటవేసిన ఉదంతాన్ని తన సన్నిహితుల వద్ద చెప్పుకున్నారట. బయట చూస్తే 'అబ్బో, మావోడు సీఎం దగ్గర ఎన్నిపనులు చేసుకుంటుండో అనుకుంటరు. కానీ, అక్కడ అయిందీ లేదు, పోయిందీ లేదు' అని సదరు ఎమ్మెల్యే ఆవేదన వ్యక్తం చేశారట. చేయాల్సిన పనులే కాదు.. అసలు కావాల్సిన పనులు కూడా కావడం లేదని కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు నిర్వేదం చెందుతున్నారు. 'మేం పట్టుకుపోయిన ఏ పనీ కావడం లేదు. కానీ పక్కరాష్ట్రం (ఏపీ) వాళ్ల పనులు మాత్రం మనిషి లేకున్నా జరిగిపోతున్నాయని ఒక ఎమ్మెల్యే ఉసూరుమన్నారు.

అప్పుడన్నా పనులు అయ్యేవి

ప్రతిపక్షంలో ఉన్నప్పుడైనా ఏ పని అంటే ఆ పని అయిందని, ఇప్పుడు చెప్పుకోవడానికి ఒక చిన్న పని కూడా లేదని ఎమ్మెల్యేలు, నేతలు వాపోతున్నారు. కేసీఆర్ ప్రభుత్వంలో కేటీఆర్, హరీశ్‌రావు, కవిత, నిరంజన్‌రెడ్డి, జగదీశ్‌రెడ్డి, వినోద్‌కుమార్.. ఇలా ఎవరిని కలిసి మాట వరుసకు చెప్పినా పనులు అయ్యేవని, 'మీ పని అయిపోయింది' అని వారే స్వయంగా ఫోన్ చేసి చెప్పేవారని గుర్తు చేసుకుంటారు. 'మా గవర్నమెంట్ల మా పనులే అయితలేవు. ఇక ప్రజల పనులేం చేస్తాం' అని కాంగ్రెస్ పార్టీ సీనియర్ ఎమ్మెల్యే సన్నిహితుల వద్ద వాపోయారట.

అన్నీ అస్తవ్యస్తమే

'కేసీఆర్ ఫాంహౌస్‌కే పరిమితం అయిండు. సెక్రటేరియట్‌కు రావడం లేదని ఎంత మొత్తుకున్నా జరగాల్సిన పనులు వేటికవే జరిగిపోతూ ఉండేవి. ఆయన పదేండ్ల కాలంలో పనులన్నీ చకచకా జరిగాయి. కానీ ఇప్పుడు యూరియా లేదని, విత్తనాలు దొరకడం లేదని రైతులు నిరసన తెలుపుతున్నారు. రైతుబంధు పైసలు పడ్తాయో, లేదోనని దిగులుగా ఉన్నారు. రూ. 2 లక్షల రుణమాఫీ చేశామని ప్రభుత్వం చెప్తున్నా క్షేత్రస్థాయిలో గందరోళం నెలకొన్నది. మిషన్ భగీరథ నీళ్లు రావడం లేదని, దవాఖానల్లో కనీస మందు గోళీలు లేవని విమర్శలు వినిపిస్తున్నాయి. మొత్తంగా పరిపాలన చేతకాకపోవడం వల్ల రాష్ట్రంలో అన్నివర్గాల ప్రజల నుంచి కాంగ్రెస్ ప్రభుత్వంపై వ్యతిరేకత పెల్లుబికుతున్నది. 'నాయకుడు సరైన రీతిలో ఎత్తుగడలు సక్రమంగా వేయకపోతే నష్టం ఆ నాయకుడికి, పార్టీకే పరిమితం అవుతుంది. కానీ, పాలకుడు సరైన నిర్ణయం తీసుకోకపోతే దాని ప్రభావం మొత్తం రాష్ట్ర ప్రజల మీద పడుతుంది' అని సీనియర్ రాజకీయ నేత ఒకరు వ్యాఖ్యానించారు.

సమీక్షల్లోనూ డొల్లతనమే

పాలకులకు ఉండాల్సిన దూరదృష్టి, అవగాహన, ప్రజా సమస్యల పరిష్కారం పట్ల ఉండే చిత్తశుద్ధి ప్రస్తుతం రాష్ట్రంలో కొనసాగుతున్న కాంగ్రెస్ సర్కార్‌కు లేవని ఉన్నతాధికారులు గుసగుసలాడుకుంటున్నారు. అన్ని రంగాల్లో అందరికీ అవగాహన ఉండాల్సిన అవసరం లేదు. ముఖ్యమంత్రి హోదాలో ఉన్న వ్యక్తికి కనీస అవగాహన లేకపోతే కష్టం అని ఒక సీనియర్ అధికారి ఒకరు పేర్కొనడం గమనార్హం. రెండు మూడు రోజుల క్రితం వినాయక చవితి నిమజ్జనం ఏర్పాట్లపై జరిగిన సమీక్షలో సీఎం స్థాయిలో ఉన్న నాయకుడు ఒక ఏసీపీకి అదే పనిగా సూచనలు ఇవ్వడం గందరగోళానికి దారి తీసింది. దీంతో పోలీసు ఉన్నతాధికారి ఒకరు కల్పించుకుని సరిచేయబోతుండగా 'ఇదర్ క్యా చల్రా. ఆప్ క్యా కరే. పహెలే మేరే బాత్ సునో' అని సదరు పోలీసు ఉన్నతాధికారిని సీఎం వారించారు. ఇలా ఏ విషయంలోనూ పట్టులేక, అధికారులకు ఎటువంటి సూచనలు ఇవ్వాలో, ఏవీ ఇవ్వకూడదో తెలియక పాలన అభాసుపాలవుతుందనే వాదన బలంగా వినిపిస్తున్నది.

కేసీఆర్ డబ్బును ప్రేమించడు

- డబ్బు కోసం రాజకీయం చేయడు
- కేసీఆర్ చాలామందికి అర్థంకాడు
- ఆయన తత్వాన్ని నేను గ్రహించా
- పార్టీ పెట్టినప్పుడు కూడా పైసా లేదు
- సిద్ధాంతాన్ని నమ్మి పనిచేస్తాడు
- మనసు బాగలేకుంటే మౌనమునే..
- ఎమ్మెల్సీ కవిత జగమొండి
- ఒత్తిడి వచ్చినా అప్రూవర్‌గా మారలే
- 'నమస్తే తెలంగాణ'తో తెలంగాణ ఉద్యమకారుడు గాదె ఇన్నయ్య

**రాష్ట్రంలో ఇప్పుడున్న కాంగ్రెస్ పార్టీ పాలన, గత